క్లుప్తంగా

తిరుపతి గంగమ్మకు విశేష పూజలు


విశేష అలంకరణలో తిరుపతి గంగమ్మ

భాకరాపేట : చిన్నగొట్టిగల్లు చెరువు కట్టపై వెలసిన తిరుపతి గంగమ్మకు మంగళవారం విశేష పూజలు చే పట్టారు. జేష్టమాసం, ఏకాదశి, భరణి నక్షత్రం కావడంతో అమ్మవారికి ఉదయాన్నే అభిషేకం, అర్చనలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ ధర్మకర్తలు భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

తల్లి పేరిట మొక్కను నాటండి


డా.శ్యామ్‌ప్రసాద్ బెనర్జీకి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

రామచంద్రాపురం: ప్రతిఒక్కరూ తమ తల్లి పేరుతో ఒక మొక్కను నాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలని బీజేపీ జిల్లా కార్యదర్శి హరినాథ్ రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం డా.శ్యామ్‌ప్రసాద్ బెనర్జీ జయంతిని పురస్కరించుకుని స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేడి తాపం తగ్గాలన్నా, పర్యావరణం కాపాడుకోవాలన్నా చెట్లను పెంచాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు విశ్వనాథ్, వెంకటముని, మునెయ్య, శివ, చండేశ్వర్‌రెడ్డి, శంకర్, సుబ్రమణ్యం, జగదీష్ పాల్గొన్నారు.

ఫిజియోథెరపీ ప్రిన్సిపల్‌కు రెండు అవార్డులు


డాక్టర్ మాధవిని అభినందిస్తున్న స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్‌వీ కుమార్

తిరుపతి తుడా: శ్రీవేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ(స్విమ్స్) కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపీ ప్రిన్సిపల్ డాక్టర్ మాధవి రెండు ప్రత్యేక అవార్డులను అందుకున్నారు. ఆమె కోయంబత్తూరు, హైదరాబాద్‌లో జూన్‌లో వేర్వేరుగా నిర్వహించిన కాన్ఫరెన్స్‌లలో రెండు ప్రత్యేక అవార్డులను అందుకున్నట్లు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ మాధవి మాట్లాడుతూ నెహ్రూ కాలేజి ఆఫ్ ఫిజియోథెరపీ, కోయంబత్తూరు నుండి ఇంటర్నేషనల్, ఇంటర్ కాలేజియేట్‌లో మేరీ మెక్ మిలియన్ అవార్డును, ఫిజియో ఫౌండేషన్ ఆఫ్ ఇండియా, అపోలో కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపీ హైదరాబాద్‌లో నిర్వహించిన 2వ ప్రపంచ కాంగ్రెస్ ఫిజికల్ థెరపీలో ఫిజియో ఎక్సలెన్స్ అవార్డులను అందుకున్నట్లు తెలియజేశారు. స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.వి.కుమార్ అవార్డులను అందుకున్న డాక్టర్ కె.మాధవిని మంగళవారం డైరెక్టర్ చాంబర్‌లో అభినందించారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 10 కంపార్ట్‌మెంట్లు నిండాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 75,449 మంది స్వామివారిని దర్శించుకోగా 27,121 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.91 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

5 నుంచి పరాశరేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

నారాయణవనం: టీటీడీ అనుబంధ చంపకవల్లి సమేత పరాశరేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు జూలై 5న నుంచి తొమ్మిది రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు ఆలయాధికారి నాగరాజు తెలిపారు. శుక్రవారం ఉదయం 5.45 నుంచి 6.45 గంటల మధ్య మిథున లగ్నంలో నిర్వహించే ధ్వజారోహణంతో ఉత్సవాలు ప్రారంభవుతాయన్నారు. ప్రతిరోజూ ఉత్సవాల్లో ఉదయం స్నపన తిరుమంజనం సాయంత్రం వాహన సేవ నిర్వహించనున్నట్లు తెలిపారు. శుక్రవారం సాయంత్రం చంద్రప్రభ వాహనసేవ జరుగుతుందన్నారు. జూలై 6 సాయంత్రం సింహవాహనం, 7వ తేదీ రాత్రి హంసవాహనం, 8న రాత్రి శేష వాహనం, 9న నంది వాహనం, జూలై 10న గజవాహనంపై స్వామివారిని ఊరేగించనున్నట్లు తెలిపారు. జూలై 11న రథోత్సవం, 12వ తేదీ సాయంత్రం స్వామి,అమ్మవార్ల కల్యాణోత్సవం, అనంతరం అశ్వ వాహనసేవ నిర్వహించనున్నారు. జూలై 13వ తేదీ ఉదయం నటరాజస్వామివారి ఉత్సవం, రాత్రి రావణేశ్వర వాహనసేవ జరుగనున్నాయని చెప్పారు. జూలై 14వ తేదీ ఉదయం త్రిశూలస్నానం, అదేరోజు రాత్రి ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయని తెలిపారు. ఈనెల 12వ తేదీన నిర్వహించనున్న ఆర్జిత కళ్యాణోత్సవంలో రూ.500 చెల్లించి పాల్గొనే గృహస్తులకు అన్నప్రసాదాలు, వస్త్ర బహుమానం అందిస్తున్నట్లు నాగరాజు తెలిపారు.

వ్యర్థాలను వందశాతం వేరుచేయాల్సిందే..!

- ఇంజినీరింగ్ పనులను వేగవంతం చేయండి
- కమిషనర్ అదితిసింగ్


తూకివాకంలో సాలిడ్‌వేస్ట్ మేనేజ్‌మెంట్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ అదితిసింగ్

తిరుపతి తుడా: తూకివాకం గ్రీన్ సిటీలో నిర్వహిస్తున్న సాలిడ్‌వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్టులను పూర్తి స్థాయిలో నిర్వహించాల్సిందేనని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అదితిసింగ్ అధికారులను ఆదేశించారు. ఇంజినీరింగ్, పబ్లిక్‌హెల్త్ అధికారులతో కలిసి కమిషనర్ మంగళవారం తూకివాకం గ్రీన్ సిటీని సందర్శించారు. తూకివాకంలో నిర్వహిస్తున్న సాలిడ్‌వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్టులను తనిఖీలు నిర్వహించి, వాటి పనితీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సాలిడ్‌వేస్ట్ మేనేజ్‌మెంట్, వ్యర్థాల వేరు చేసే ప్రక్రియను వందశాతం నిర్వహించాలని సూచించారు. ప్రతి ప్రాజెక్టు పనితీరు మెరుగ్గా జరిగి తీరాల్సిందేనని ఆమె సూచనలు చేశారు. ఇందులో నిర్లక్ష్యం వహిస్తే కఠినమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇంటింటా చెత్త సేకరణ, తరలింపు వేరే చేసే ప్రక్రియ క్రమపద్ధతిలో నిర్వహించేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. స్వచ్ఛత విషయంలో ఎక్కడా రాజీ పడే ప్రసక్తే లేదని చెప్పారు. అనంతరం ఇంజినీరింగ్ అధికారులతో ఆమె మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. నగరంలో చేపట్టిన అభివృద్ధి పనులు వాటి పురోగతిపై ఆరా తీశారు. ముఖ్యంగా స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులో భాగంగా అభివృద్ధి చేస్తున్న పనుల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నిర్మిస్తున్నామని, ఆ పనులను వేగవంతంగా పూర్తి చేసేందుకు ఇంజినీర్లు చొరవ తీసుకోవాలని ఆదేశించారు. అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని ఆమె అధికారులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ చరణ్‌తేజరెడ్డి ఎస్‌ఈ మోహన్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువఅన్వేష్, మున్సిపల్ ఇంజినీర్లు చంద్రశేఖర్, వెంకటరామిరెడ్డి, విజయ్‌కుమార్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మిశ్రమ పంటల సాగుతో అధిక లాభాలు


రైతుల పొలాలను పరిశీలిస్తున్న ప్రకృతి వ్యవసాయ డీపీఎం షణ్ముగం

రామచంద్రాపురం: రైతులు ప్రకృతి వ్యవసాయం ఆచరించి సాగు చేపట్టడం ద్వారా అధిక లాభాలను పొందవచ్చని డీపీఎం షణ్ముగం అన్నారు. మంగళవారం మండలంలోని అనుప్పల్లి, సీకాలేపల్లి, నెత్తకుప్పం, వేపకుప్పం, రాయలచెరువు, కుప్పంబాదూరు గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం ఆచరించే రైతుల పొలాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు మిశ్రమ పంటల వల్ల కలిగే లాభాలను గురించి వివరించారు. అలాగే జీవామృతం, బీజామృతం కషాయాల తయారీని తెలియజేశారు. గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ అవగాహన ర్యాలీలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ రాష్ట్ర సీనియర్ కన్సల్టెంట్ సురేంద్ర రెడ్డి, అడిషనల్ డీపీఎం పట్టాభిరెడ్డి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

డయేరియా నియంత్రణ అందరి బాధ్యత

భాకరాపేట : డయేరియాను నియంత్రించడం మనందరి బాధ్యత అని చిన్నగొట్టిగల్లు ఎంపీడీఓ సోమశేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం చిన్నగొట్టిగల్లు మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో అతిసార నిలుపుదల ప్రచారంపై ర్యాలీలు, సమావేశాలు నిర్వహించడం, తద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అలాగే పరిసరాల పరిశుభ్రతపై తరుచూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు అందరినీ భాగస్వాములను చేయాలన్నారు. ఫ్రై డే డ్రైడే కార్యక్రమాలు విధిగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పంచాయతీ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు అందరితో కలసి సహకారం, సమన్వయంతో వ్యవహరిస్తూ డయేరియాను ఆపడం మనందరి బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. సమావేశంలో వైద్యాధికారి తేజస్విని, శేషకుమారి, అమరనాథ్ రెడ్డి, సుబ్రమణ్యం, వసంతకుమారి, ఏఎన్‌ఎంలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

కెనడా డే పోటీ విజేతలుగా తిరుపతి రచయితలు


పేరూరు బాల సుబ్రమణ్యం


కథా రచయిత్రి ఎంఆర్.అరుణ


రచయిత రాచపూటి రమేష్

తిరుపతి కల్చరల్: కెనడా డే సందర్భంగా అంతర్జాతీయ స్థాయిలో విజేతలుగా తిరుపతి జిల్లా రచయితలు నిలిచారు. తెలుగుతల్లి కెనడా మాస పత్రిక కెనడా డే దినోత్సవంలో భాగా ప్రతి ఏటా నిర్వహించే అంతర్జాతీయ కవితలు, కథల పోటీలు నిర్వహించి బహుమతులతో సత్కరించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా 2024 ఏడాదికి సంబంధించి తిరుపతికి చెందిన కవి, కథా రచయిత పేరూరు బాలసుబ్రమణ్యం కవితల్లో విజేతగా నిలిచారు. ఈయన 2020లో రాసిన ఆటగదరా శివా కథకు, 2023లో ప్రాణ దాతలు కవితకు బహుమతులు రాగా ఈఏడాది మూడో సారి నాన్న కవిత బహుమతికి ఎంపిక కావడం విశేషం. అలాగే వీరితో పాటు కథా రచయిత్రి ఎంఆర్.అరుణకుమారి రాసిన మరుజన్మకు నువ్వే కథకు, రచయిత రాచపూటి రమేష్ రాసిన ఆ నాటి చెలిమి కథకు బహుమతులు లభించాయి. అంతర్జాతీయ పోటీలలో విజేతలుగా ఎంపికైన వీరిని అభ్యుదయ రచయిత సంఘం నేతలు సాకం నాగరాజు, యువశ్రీ మురళి, డాక్టర్ నెమిలేటి కిట్టన్న, రచయితలు ఆర్‌సీకే.రాజు, మన్నవ గంగాధరప్రసాద్, వాకా ప్రసాద్‌తో పాటు పలువురు సాహితీ ప్రియులు అభినందించారు.

14 నుంచి సౌమ్యనాథస్వామి

వార్షిక బ్రహ్మోత్సవాలు

తిరుపతి(అలిపిరి): అన్నమయ్య జిల్లా నందలూరు శ్రీ సౌమ్యనాథ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 14 నుంచి 22వ తేదీ వరకు వైభవంగా జరుగనున్నాయని మంగళవారం టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. బ్రహ్మోత్సవాలకు ఈనెల 13న అంకురార్పణ నిర్వహిస్తారని, 14న ఉదయం 7.45 నుంచి 8.15 గంటల వరకు కర్కాటక లగ్నంలో ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. బ్రహ్మోత్సవాల్లో రోజూ ఉదయం 8 గంటలకు, రాత్రి 7 గంటలకు వాహనసేవలు జరుగనున్నాయి. 14న ఉదయం ధ్వజారోహణం, రాత్రి యాలి వాహనం, 15 ఉదయం పల్లకీ సేవ, రాత్రి హంస వాహనం, 16 ఉదయం పల్లకీ సేవ, రాత్రి సింహ వాహనం, 17న ఉదయం పల్లకీ సేవ, రాత్రి హనుమంత వాహనం, 18 ఉదయం శేష వాహనం, రాత్రి గరుడ వాహనం, 19 ఉదయం సూర్యప్రభ వాహనం, రాత్రి చంద్రప్రభ వాహనం, 20 ఉదయం ఆర్జిత కల్యాణోత్సవం (ఉదయం 10 గంటలకు), రాత్రి గజ వాహనం, 21న ఉదయం రథోత్సవం, రాత్రి అశ్వవాహనం, 22న ఉదయం చక్రస్నానం, రాత్రి ధ్వజావరోహణం కార్యక్రమాలు జరుగుతాయి. 20న ఉదయం 10 గంటలకు ఆర్జిత కల్యాణోత్సవం జరుగనుంది. గృహస్తులు(ఇద్దరు) రూ.500 చెల్లించి కల్యాణోత్సవంలో పాల్గొనవచ్చు. గృహస్తులకు ఒక ఉత్తరీయం, రవికె, అన్నప్రసాదాలు బహుమానంగా అందజేస్తారు. జూలై 23న సాయంత్రం 6 గంటలకు పుష్పయాగం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టు, దాససాహిత్య ప్రాజెక్టుల ఆధ్వర్యంలో రోజూ ఆధ్యాత్మిక, భక్తి సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

డయేరియా నియంత్రణే లక్ష్యం


అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న వైద్యాధికారులు

చంద్రగిరి: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు డయేరియా బారిన పడకుండా నెలరోజుల పాటు మండల వ్యాప్తంగా ప్రజలకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు కొటాల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక తెలిపారు. మంగళవారం కొటాల పీహెచ్‌సీ నుంచి వైద్యాధికారులు, సిబ్బందితో కలసి ఆమె అవగాహన ర్యాలీ నిర్వహించారు. అంతకుముందు డయేరియా నివారణపై తీసుకోవాల్సిన చర్యలను సిబ్బందికి వివరించారు. ఆమె మాట్లాడుతూ.. జులై 1 నుంచి 31వ తేదీ వరకు స్టాప్ డయేరియా, డెంగీపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. పుట్టిన శిశువులకు ఆరు మాసాల పాటు తల్లి పాలను ఇవ్వడం ద్వారా డయేరియా బారిన పడకుండా కాపాడుకోవచ్చన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డేను పాటించాలని ప్రజలను ఆమె కోరారు. కార్యక్రమంలో డాక్టర్ కుసుమ, డాక్టర్ అలెగ్జాండర్, ఎంపీఈహెచ్‌ఓ ఈశ్వరయ్య, సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఎస్వీజీపీకి ఆర్థికసాయం

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి కేటీ రోడ్డులోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మెకానికల్ విభాగానికి చెందిన 2008–2011వ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు తమ విభాగం అభివృద్ధికి ఆర్థిక సాయం అందించారు. మంగళవారం ఆ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై.ద్వారకనాథరెడ్డికి పూర్వవిద్యార్థులు ఎస్.మధుసూదన్, బి.చాణక్య, బి.హరీష్ రూ.26,500ను అందించి మెకానికల్ వర్క్‌షాపునకు కావాల్సిన పరికరాలను కొనాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మెకానికల్ ఇంజినీరింగ్ విభాగపు సీనియర్ లెక్చరర్ డాక్టర్ కెఈ.శరత్ రాఘవేంద్ర పాల్గొన్నారు.

రైళ్ల రాకపోకలకు అంతరాయం


ఏర్పేడు రైల్వే స్టేషన్ సమీపంలో ఆగిన రైలు

ఏర్పేడు: రెండు రోజులుగా ఏర్పేడు రైల్వేస్టేషన్ సమీపంలో రైళ్ల రాకపోకలకు అంతరాయం జరుగుతోంది. ఏర్పేడు రైల్వేస్టేషన్ సమీపంలో రెండు రోజులుగా రైల్వే ట్రాక్ మరమ్మతు పనులు జరుగుతున్నాయి. ఈ క్రమంలో శ్రీకాళహస్తి, తిరుపతి మార్గాల వైపు వెళ్లే రైళ్లు, గూడ్స్ రైళ్లు గంటల తరబడి ఆగిపోతున్నాయి. సుదూర ప్రాంతాలు, ప్రభుత్వ కార్యాలయాలు, ఇతర సమస్యలపై వెళ్లే ప్రయాణికులు తగిన సమయానికి గమ్యానికి చేరుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో మంగళవారం తిరుపతి నుంచి శ్రీకాళహస్తి వైపు వెళ్లే రైలు ఉదయం 7 గంటలకు అంజిమేడు పంచాయతీ పరిధిలోని పోతుమానిగుంట ఎస్టీ కాలనీ గేటు వద్ద సిగ్నల్ పడకపోవడంతో ఆగిపోయింది. తిరిగి ఉదయం 7.40 గంటలకు రైలుకు సిగ్నల్ పడటంతో బయలుదేరి వెళ్లింది. 40 నిమిషాలపాటు ప్రయాణికులు రైలులో ఇబ్బందులు పడ్డారు. కొంతమంది ప్రయాణికులు రైలు కిందికి దిగి ఏమి జరిగిందోనని ఆరా తీశారు. మరమ్మతులు జరుగుతున్నాయని తెలుసుకున్న ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. రైల్వేట్రాక్ మరమ్మతుల పనులు నత్తనడకన సాగుతుండడంతో రైళ్ల రాకపోకలకు అంతరాయం జరుగుతోందని ప్రయాణికులు వాపోతున్నారు.

ఆడికృత్తిక ఉత్సవాలను ఘనంగా నిర్వహించండి

పాకాల: స్థానిక ఊట్లవారిపల్లికి సమీపంలోని ఆనందగిరి కొండపై వెలసిన శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రమణ్య స్వామివారి ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించాలని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం అధికారులతో సుబ్రహ్మణ్య స్వామి ఆలయ ఆవరణలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 27వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలకు ఇతర జిల్లాల నుంచి కూడా పెద్దసంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉందని, అందుకు తగ్గట్టు మౌలిక సౌకర్యాలను కల్పించాలని సూచించారు. భక్తులకు తాగునీటి సమస్య రానివ్వకుండా చూడాలని, సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల వాహనాలను పార్కింగ్ చేయడానికి సరైన పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్‌శాఖ రెవెన్యూ శాఖ, రక్షిత తాగునీటి శాఖ, పోలీసులు సమన్వయంతో ఉత్సవాలను విజయవంతం చేయడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రధాన రహదారి నుంచి ఆలయం వరకు విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించాలన్నారు. కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులతో పాటు స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఆర్‌ఓ ఫిల్టర్ వితరణ


డీఎంహెచ్‌ఓ చేతుల మీదుగా ఆర్వో ఫిల్టర్‌ను బహూకరిస్తున్న ట్రస్ట్ నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: జిల్లా డిస్ట్రిక్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్ ఆర్‌బీఎస్‌కేకి ఉదయ్ సపోర్ట్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం ఆర్వో ఫిల్టర్‌ని వితరణ చేశారు. ఈ ఆర్వో ఫిల్టర్‌ను డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీహరి చేతుల మీదుగా సెంటర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీహరి మాట్లాడుతూ ఆటిజం ఉన్న పిల్లలకు ఇక్కడ చికిత్స అందజేయడం జరుగుతుందని, ఆ సమస్య ఉన్న పిల్లను ఇక్కడికి తీసుకురావాలని తెలిపారు.

చారిటుబల్ ట్రస్ట్ సేవా దృక్పథంతో సెంటర్‌కు ఆర్వో ఫిల్టర్‌ను అందజేయడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షురాలు తహసున్నీసా బేగం, డిస్ట్రిక్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పద్మావతి, పీడియాట్రీషియన్ డాక్టర్ ప్రదీప్, మేనేజర్ డాక్టర్ గుణశేఖర్, ఆర్‌బీఎస్‌కే సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన


శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏడీఏ భాస్కరయ్య

భాకరాపేట : ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన పంట దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ భాస్కరయ్య తెలిపారు. ఎర్రావారిపాళెం మండలం నెరబైలు రైతు సేవా కేంద్రంలో ఆత్మ సహకారంతో రైతులకు మంగళవారం శిక్షణా కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో నేలలో జీవం పెరిగి రసాయనిక అవశేషాలు లేని ఆహారం ప్రజలకు అందుతుందని తెలిపారు. మామిడి, టమాట పంటల్లో ఆచరించవలసిన ప్రకృతి సాగు పద్ధతుల గురించి వివరించారు. జిల్లా వనరుల కేంద్రం ఏఓ వేణుగోపాల్‌రావు వేరుశనగ పంటల్లో పాటించవలసిన మేలైన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఓ ఖాదర్‌బాషా, వ్యవసాయ విస్తరణాధికారులు నళినిదేవి, మునిశేఖర్, రాజశేఖర్, హరిత, తేజస్విని, కళ్యాణి, దేవసేన తదితరులు పాల్గొన్నారు.

వాతావరణ మార్పులతో నష్టాలు

భాకరాపేట : ప్రస్తుత వాతావరణంలో వస్తున్న మార్పుల కారణంగా రైతులు నష్టపోతున్నారని వ్యవసాయ శాఖ జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ భాస్కరయ్య తెలిపారు. చిన్నగొట్టిగల్లు రైతు సేవాకేంద్రంలో మంగళవారం ఆత్మ పథకం కింద రైతులకు శిక్షణ ఇచ్చారు. అనావృష్టితో బెట్ట పరిస్థితులు, అకాల వర్షాలు, పంటలలో కొత్త రకాల చీడీలు వాతావరణ మార్పుల వల్ల రైతులకు ఇబ్బంది కలిగిస్తున్నాయని తెలిపారు. డ్రిప్ ఇరిగేషన్, వేరుశనగలో కంది, ఆముదంతో అంతర పంటల సాగు, పొలాలకు అధికంగా సేంద్రియ ఎరువుల వాడకంతో ప్రస్తుత పరిస్థితుల్లో మంచి ఫలితాలు వస్తాయని వివరించారు. సమావేశంలో ఏఓ ధనలక్ష్మి, జిల్లా వనరుల కేంద్రం ఏఓ వేణుగోపాలరావు మాట్లాడుతూ వరి, వేరుశనగ, పంటల సాగులో మెలకువలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ సహాయకులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సంఘటిత పోరాటానికి సిద్ధం కావాలి


నూతన ఆటో స్టాండ్‌ను ప్రారంభిస్తున్న ఏఐటీయూసీ నేతలు

తిరుపతి కల్చరల్: కొత్త కొత్త చట్టాలతో తిరుపతి ట్రాఫిక్ ఆంక్షలతో ఆటో కార్మికులపై పెనుభారం మోపుతున్న నేపథ్యంలో, అందుకు వ్యతిరేకంగా ఆటో కార్మికులంతా సంఘటితమై సమరానికి సిద్ధం కావాలని ఏఐటీయూసీ నగర అధ్యక్ష, కార్యదర్శులు సురేష్, వెంకటేష్ పిలుపునిచ్చారు. ఎంఆర్ పల్లి సర్కిల్లో నూతనంగా ఏర్పాటు చేసిన ఆటోస్టాండ్‌ను వారు ప్రారంభించారు. అలాగే ఏఐటీయూసీ ఆటో కార్మిక సంఘం స్టికర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిగ్నల్ పాయింట్ల వద్ద విపరీతమైన ట్రాఫిక్ ఆంక్షలు, పెనాల్టీలు వేస్తూ భయాందోళనలకు గురి చేస్తున్నారని తెలిపారు. మరోవైపు ఫైనాన్స్ ఆగడాలు ఎక్కువయ్యాయని తిరుపతి నగరంలో ఆటోలు నిలపరాదని ఆటో స్టాండ్‌ల వద్దకు వెళ్లి పోలీసులు బెదింపులకు దిగడం విడ్డూరమన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఆటో కార్మికులకు అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి 50 ఏళ్ల దాటిన ప్రతి ఒక్కరికీ కేరళ ప్రభుత్వం తరహాలో రూ.6 వేలు ఫించన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆటోస్టాండ్ అధ్యక్షుడు పి.కుమార్, నాయకులు ఖలీల్, నాగరాజు, మోహన్, షేక్ బాషా, శంకర నాయక్, ఆటో కార్మికులు పాల్గొన్నారు.